కొలువుదీరిన గణనాథులు



ఆసిఫాబాద్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజుల పాటు ఘనంగా పూజలు అందుకోనున్న గణనాథులు జిల్లా వ్యాప్తంగా బుధవారం కొలువుదీరారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో సంఘసేవ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ వినాయకుడ్ని ప్రతిష్ఠించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇంట్లో వినాయకుడిని ప్రతిష్ఠాపించి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వమించారు. వన్‌నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్, బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్ష కోసం కృషి చేయడంలో భాగంగా జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్, మున్నూరు కాపు సంఘం, పద్మశాలి సేవా సంఘం, వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గణేష్ చవితి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు తన నివాసంలో పూజలు చేశారు. అలాగే సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వివిధ కూడళ్లలో ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద పూజలు నిర్వహించారు. పట్టణంలో ఉదయం నుంచి వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మట్టివినాయక విగ్రహలను పంపిణీ చేశారు. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఆధ్వర్యంలో మట్టివినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో గణనాథులు కొలువు తీరా రు. భాజాభజంత్రీల మధ్య వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాలను వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆలయాల్లో, ప్రధాన కూడళ్లలో గణనాథులను భాజాభజంత్రీల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. పలు మండపాల వద్ద నిత్య అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో గణనాథులను ప్రతిష్ఠించారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పురస్కరించుకుని బుధవారం గణనాథులు కొలువు తీరారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపా లను వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు బుధవారం మండ లంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు కిరిమిల్ల వినోద్ మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాగృతి కమిటీ సభ్యులు రాకేష్, మోసిన్, చిందం రాజు, కమలాకర్, తిరుపతి పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో లడ్డూలతో ఏర్పాటు చేసిన గణనాథుడు

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయకులను ప్రతిష్ఠించారు. మండల కేంద్రంలోని సర్వజనిక్ గణేష్ మండలి అధ్వర్యంలో వినాయక ఉత్సవాలను గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావు, మండలి సభ్యులతోపాటు ఎస్సై రామకృష్ణా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లో గణ నాథులు కొలువు దీరారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేశ్ నవరాత్రులు నిర్వహించుకోవాలని ఎస్సై రవికు మార్ సూచించారు.



వాంకిడిలో మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న జాగృతి నాయకులు



మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



పూజలు చేస్తున్న బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు

బీజేపీ నాయకుల దీక్ష విరమణ



ఎంపీవో ఖాజా అజీజోద్దీన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాంకిడి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జరిగిన అవకతవకతలపై విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు చేపడుతున్న ఆమరణ దీక్ష బుధవారం రాత్రి విరమించారు. ఎంపీవో ఖాజా అజీజోద్దిన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రాత్రి 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న శిబిరాన్ని సందర్శించారు. ఇళ్ల మంజూరులో జరిగిన అవకతవకతలపై కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరుపుతామని హామీ ఇవ్వడంతో బీజేపీ నాయకులు దీక్షను విరమించారు. ఈ సందర్భంగా ఇళ్ల మంజూరిలో జరిగిన అవకతవకతలపై విచారణ జరిపి అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ ఎంపీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, దుర్గం అక్షయ్, గణేష్, సాయి, నవీన్, సాగర్, పవన్, రామగిరి విశాల్ పాల్గొన్నారు.

ఏడు కాళ్లు.. రెండు తోకలతో గొర్రె పిల్ల జననం

పెంచికలపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతెపల్లి గ్రామంలో బుధవారం డోకె కమలాకర్‌కు చెందిన గొర్రె వింత ఆకారంలో ఉన్న గొర్రె పిల్లలకు జన్మనిచ్చింది. ఏడు కాళ్లు, రెండు తోకలు, రెండు కడుపులు, ఒక తలతో వింత గొర్రె పిల్లకు జన్మించింది. గొర్రె పిల్ల జన్మించిన నిమిషాల వ్యవధిలోనే మృతి చెందినట్లు సదరు యజమానికి తెలిపాడు. గొర్రె పిల్ల వింత ఆకారంలో ఉండడంతో దాన్ని చూసేందుకు స్థానికులు తరలి వచ్చారు. ఈ విషయమై పశువైద్యాధికారి రాకేష్‌ను సంప్రదించగా జన్యులోపం వల్ల పశువులకు కొన్ని సార్లు ఇలాంటి పిల్లలు పడుతాయని చెప్పారు. సాధారణంగా ఇలా జన్మించినవి బతకవని, కొంత సమయానికే చనిపోతాయని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిర్పూర్(యు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన ఆత్రం కృష్ణ (30) అనే యువకుడు గురువారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఈ నెల 23న హస్నాపూర్ వైపు నుంచి జైనూర్‌కు బైక్‌పై వస్తున్నాడు. జైనూర్ మండలం జంగాం గ్రామ సమీపంలో అదుపుతప్పి పడిపోయాడు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మహిళను మోసగించిన ఒకరిపై కేసు

రెబ్బెన, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలానికి చెందిన ఓ మహిళ వద్ద డబ్బులు తీసుకోవడంతో పాటు లైంగికదాడికి పాల్పడిన నంబాలకు చెందిన హరీష్‌పై కేసునమోదు చేసినట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు హరీష్‌తో పాటు సహకరించిన కమలాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జిల్లాలో భారీ వర్షం

- ఉప్పొంగిన వాగులు, ఒర్రెలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



కుమరం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తిన అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం గురువారం ఉదయం వరకు కురిసింది. జిల్లాలోని రెబ్బెనలో అత్యధికంగా వర్షపాతం నమోదు అయింది. పలు మండలాల్లో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచి పోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని వర్షాపాతానికి సంబంధించి పరిస్థితులపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు ఫోన్ చేసి ఆరా తీశారు. అధికారులను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలని ఆదేశాల జారీ చేశారు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన కుమరం భీం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో బుధవారం రెండు గేట్లు ఎత్తి నీటిని వదిలిన అధికారులు గురువారం ఉదయం వరకు మూడు గేట్లను మీటర్ మేర ఎత్తి 6,324 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టు కూడా వరద పెరగడంతో నాలుగు గేట్లు ఎత్తి 6,500 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. వాతావరణ శాఖ సూచన హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఉత్తర్వులు జారీ చేశారు.

కాగజ్‌నగర్ , (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఒక వైపు పండుగ వేడుకలు చేసుకునేందుకు కూడా బయటికి పోలేని పరిస్థితి ఏర్పడింది. వర్షానికి వివిధ కాలనీల్లోకి వర్షం నీరు చేరింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 7.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా లోతట్టు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. గ్రామ సమీపంలోని లోలెవల్ రోడ్డుడ్యాంలు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంట చేలలోకి వెళ్లిన రైతులు, కూలీలు గంటల తరబడి వేచి చూసి వరద ప్రవాహం తగ్గగానే ఇళ్లకు చేరుకున్నారు. ఎస్సై విక్రమ్ వరద ప్రవాహాన్ని పరిశీలించారు. సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి వాగులు, ఒర్రెలు పొంగిపొర్లాయి. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు.



దహెగాంలో ఉధృతంగా ప్రవహిస్తున్న లోలెవల్ వంతెన



కాగజ్‌నగర్‌లో నిలిచిన వర్షం నీరు

ఇక హాజరు పక్కా



- జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్
- ఏఐ టెక్నాలజీ ఆధారంగా చర్యలు
- ఉత్తీర్ణతశాతం పెంచడమే ధ్యేయంగా ప్రణాళిక

బెజ్జూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇకపై జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు కూడా సాంకేతికతతోనే నమోదు కానుంది. కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ఫేస్ రికగ్నిషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్)ద్వారా విద్యార్థుల హాజరును పక్కాగా అమలు చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఈ వినూత్న విధానం హాజరుతో పాటు ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచుతుందని అధికారులు భావిస్తున్నారు. కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అధికారులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో కృత్రిమ మేథ ఆధారంగా పనిచేసే ఫేస్ రికగ్నిషన్ సొల్యూషన్ ద్వారా హాజరు నమోదు విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ఇంటర్మీడియెట్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఈ నెల చివరి నాటికి కొత్త హాజరు విధానం అమలులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటికే ప్రభుత్వం అధ్యాపకులకు బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్, సీసీ కెమెరాల నిఘా అమలులో ఉండగా, ఇప్పుడు విద్యార్థులకూ బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 11ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు ఐదువేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఆదేశాలు రాగానే అమలు..

కళ్యాణి, జిల్లా మాధ్యమిక విద్యాధికారి, ఆసిఫాబాద్



ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా విద్యార్థుల హాజరు నమోదు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికి సంబంధించిన కార్యాచరణపై ఇటీవల చర్చించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ఈ పద్ధతిని అమలు చేస్తాం. ఈ విధానం అమలుతో విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు ఉత్తమ ఫలితాల సాధనకు దోహదం చేస్తుంది.

వివరాలు యాప్‌లో..

ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం అవసరమైన యంత్రాల కొనుగోలు, అమరిక పనులను ఒక ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. విద్యార్థులకు సంబంధించిన ఆధార్, బయోమెట్రిక్ వివరాలను అప్లికేషన్ ద్వారా ఇంటర్మీడియెట్ వెబ్‌సైట్ లాగిన్‌లో సేకరిస్తారు. ఈ వ్యవస్థ ద్వారా తరగతి గదిలో మొత్తం విద్యార్థులకు కలిపి ఒకే ఫొటో తీసినా అందరి హాజరు నమోదవుతుంది.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 430ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పద్ధతిని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఆ లెక్కన జిల్లాలో 11జూనియర్ కళాశాలల్లో సుమారు ఐవేల మంది విద్యార్థులకు ఈ విధానం వర్తిస్తుంది. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రాగానే కళాశాలల్లో ఈ కొత్త హాజరు నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ప్రయోజనం కలిగే అవకాశం..

ఈ విధానంతో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుంది. ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లు, కళాశాల ఫీజులు పొందాలంటే 75శాతం హాజరు తప్పనిసరి. దీంతో వాటి అమలులో పారదర్శకత పెరుగుతుంది. హాజరుశాతం పెరిగితే ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియ పక్కాగా అమలు చేసేందుకు ఇంటర్ బోర్డు తీవ్రంగా కృషి చేస్తోంది.

ఇప్పటికే కళాశాలల్లో అధ్యాపకులకు ఇదే విధానాన్ని అమలు చేయగా సత్ఫలితాలు రావడంతో ఇక విద్యార్థుల హాజరు నమోదును కూడా ఏఐ ద్వారా నమోదుకు శ్రీకారం చుడుతోంది. దీంతో అధ్యాపకులు ఏ విధంగానైతే విధులకు సక్రమంగా హాజరవుతున్నారో అలాగే విద్యార్థులు కూడా నిత్యం డుమ్మాలు కొట్టకుండా కళాశాలకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో అధ్యాపకుల పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తున్నారో అదే విధంగా విద్యార్థులు కళాశాలకు వచ్చే అవకాశం ఉండటంతో పాటు పాఠాలు సరిగా బోధిస్తున్నారా లేదా అన్నదానిపై కూడా నిఘా ఏర్పాటు ఉండటంతో అటు అధ్యాపకులు, విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరు కావడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఈ నెల చివరి నాటికి ఈ విధానాన్ని అమలు చేయడానికి ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం జిల్లా నుంచి ఇటీవల ఇద్దరు అధ్యాపకులను ఎంపిక చేసి శిక్షణ కోసం హైదరాబాద్‌కు పింపించారు.

సంక్షిప్తం..

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లకుంట గ్రామ సమీపంలోని పెద్దవాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు షబ్బా తదితరులు మాజీ ఎమ్మెల్యే కోనప్ప వర్గంలో చేరారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): హత్తిని గ్రామంలో కిరాణా దుకాణంలో విద్యుదాఘాతంతో మంటలు అంటుకుని సామగ్రి దగ్ధమైంది.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని పీహెచ్‌సీలో ఔట్ సోర్సింగ్‌పై విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు బుధవారం సీహెచ్‌సీ వైద్యాధికారి నాగర్ గోజే అశోక్‌కు ఏఐటీయూసీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టపిప్పిరి, సాంగ్వీ, కేలి(బి) గ్రామాల మధ్య గల లోలెవల్ వంతెనలను గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాణిక్యాపూర్, రొంపల్లి, ఇర్కపల్లి గ్రామాల్లో వాగులను తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలంను గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో దీపక్‌రావు, రాజేశ్వర్, రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం, హత్యాయత్నం కేసులో

నిందితుడికి జీవితఖైదు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలానికి చెందిన మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం చేసిన కేసులో అదే మండలానికి చెందిన షేక్ మగ్దూంకు జీవితఖైదు విధిస్తూ ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రధాన న్యాయాధికారి కుమార్ వివేక్ గురువారం తీర్పు చెప్పారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది ఆగస్టు 31న జైనూరు మండలానికి చెందిన ఒక మహిళ సిర్పూర్(యూ)కు వెళ్లడానికి షేక్ మగ్దూం ఆటో ఎక్కింది. మార్గమధ్యలో ఆటో డ్రైవర్ ఆ మహిళపై అత్యాచా రయత్నం చేశాడు. ఆమె ప్రతిఘటించడంతో ఇనుపరాడ్‌తో తలపై, ముఖంపై బలంగా కొట్టి గాయపరిచి పారిపోయా డు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. అటుగా వెళ్లున్న ఇద్దరు ఆమె పరిస్థితిని గమనించి 108కు కాల్‌చేసి జైనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. సెప్టెంబరు 3, 2024న మహిళ స్పృహలోకి వచ్చింది. బాధితురాలి మాతృభాష తెలిసిన మహిళా పోలీస్ కానిస్టేబుల్‌ను ఆసుపత్రికి పంపి వీడియో రికార్డ్ చేస్తూ విచారిం చారు. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం సిర్పూర్(యూ) ఎస్సై రామకృష్ణ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ సదయ్య కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేశారు. స్పెషల్ పీపీ రమణారెడ్డి సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో షేక్ మగ్దూంకు జీవితఖైదు, రూ. 30వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రధాన న్యాయాధికారి కుమార్ వివేక్ తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, డీఎ స్పీలు సదయ్య, కరుణాకర్, సీఐ రమేశ్, ఎస్ఐ రామకృష్ణ, లైజన్ అధికారి ఈశ్వర్ సింగ్, స్పెషల్ పీపీ రమణారెడ్డిలను ఎస్పీ అభినందించారు. వీరికి రివార్డు అందించేలా రాష్ట్ర డీజీపీకి నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ తీర్పు లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై తీవ్రమైన హెచ్చరికగా నిలుస్తుందని తెలిపారు. పోలీస్‌శాఖ మహి ళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.

ఓటరు జాబితా ప్రదర్శన



బెజ్జూరులో జాబితాను ప్రదర్శిస్తున్న కార్యదర్శులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీల వార్డుల వారీగా గురువారం ఓటర్ల ముసాయిదా జాబితాను జిల్లా పరిషత్ కార్యాలయంలో నోటీసు బోర్డుపై ప్రచురించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. సూచనలు, అక్షేపణలు, అభ్యంతరాలు ఉంటే 30లోగా దరఖాస్తు సమర్పించాలని కోరారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): కార్యదర్శులు ఓటరు జాబితా నమూనాను ప్రదర్శించారు. వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్లలో జాబితాను ప్రదర్శించామని తెలిపారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో కార్యద ర్శులు ఓటరు జాబితాను ప్రదర్శించారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించినట్లు తెలిపారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాను కార్యదర్శులు ప్రచురించినట్లు ఎంపీడీవో అంజద్‌పాషా తెలిపారు. అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాపై ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. అన్ని గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను గురువారం ప్రచురించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య



సంపత్(ఫైల్)

జైపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లలో వేర్వేరు చోట్ల వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. జైపూర్ మండలంలోని గంగిపెల్లి గ్రామానికి చెందిన జనంపల్లి సంపత్ (34) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గంగిపెల్లి గ్రామానికి చెందిన జలంపల్లి సంపత్ కూలీ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో సుమారు మూడు లక్షల వరకు అప్పులు కావడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంలో మండల కేంద్రంలోని వెలిశాల మల్లన్న ఆలయం వద్ద గడ్డి మందు తాగాడు. స్థానికులు గమనించి మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య సంకీర్తన, కుమారుడు ఉన్నారు.

గోదావరిఖనికి చెందిన వ్యాపారి..

జైపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన భైన విజయ్ (43) గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని పట్టణంలోని మేదరిబస్తికి చెందిన విజయ్ స్టీల్‌సామాన్ల దుకాణం నడిపిస్తున్నాడు. ఈవ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో అప్పులు ఎక్కువ కాగా ఎలా తీర్చాలో తెలియక ఈ నెల 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈనెల 27న జైపూర్ మండలంలోని టేకుమట్ల గోదావరి నది ఒడ్డున మృతేహం కనిపించడంతో స్థానిక కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. కాగా ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య కల్యాణి, బాబు, పాప ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

అత్త వేధింపులు భరించలేక కోడలు..

చెన్నూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో అత్త వేధింపులు భరించలేక కోడలు తోడె రవళి (37) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెన్నూరు ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎర్రగుంటపల్లికి చెందిన తోడ రవళిని తన అత్త తోడె రాజుబాయి పలు రకాల వేధింపులకు గురిచేస్తుండేది. పెళ్లిలో తాను బంగారం పెట్టానని, నాకు ఆ బంగారం లేదా డబ్బులు ఇవ్వాలని రవళిని అత్త రాజుబాయి వేధింపులకు గురి చేస్తుంది. రవళి భర్త రవి 108 అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తుండగా గురువారం తన భర్త, ఇద్దరు పిల్లలకు లంచ్ బాక్స్ పెట్టి పంపించింది. ఈ క్రమంలో అత్తతో గొడవ జరగగా ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు రవళి తల్లి చల్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతురాలుకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

మంచిర్యాలక్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న దూట అభిలాష్‌ను అరెస్టు చేసినట్టు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. అభిలాష్ బల్లార్షా నుంచి 11 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి వస్తున్న క్రమంలో ఎస్ఐ తిరుపతి, సిబ్బంది అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నకిలీ విలేకరిపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో నకిలీ గుర్తింపు కార్డుతో విలేకరి అని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మజారోద్దీన్ తెలిపారు. రెస్టారెంట్‌లో ఓ వ్యక్తి బిల్లును చెల్లించకుండా రిపోర్టర్ అని బెదిరింపులకు పాల్పడిన సయ్యద్ సిరాజ్, అతడి మిత్రుడిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుతో ఒకరికి గాయాలు

కోటపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన దుర్గం రాజమల్లు పిడుగు పాటుకు గురయ్యాడు. బుధవారం తన పొలం వద్ద పనులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా భారీ వర్షంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పడింది. పిడుగు పాటుతో పొలంలోనే కుప్పకూలిపోయి తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే అతన్ని చెన్నూరు ఆసుపత్రికి, అక్కడి నుంచి మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా పిడుగు పాటుకు గురైన విషయాన్ని తెలుసుకున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ రాజేందర్‌కు ఫోన్ చేసి అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీ తెలిపారు.

'రియల్' ధమాల్

- అమ్మేవారున్నా కొనేవారు కరువు
- రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయానికి దెబ్బ



కాగజ్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా పడి పోయింది. గతేడాది నుంచి జిల్లాలో అధికారికంగా చేసిన 20వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసే వారు లేకుండా పోయారు. వివిధ రైతుల వద్ద ఎకరాల కొద్ది పంట పొలాలను కొనుగోలుచేసి ప్లాట్లు చేసి అమ్మకానికి పెట్టిన దందా అనూహ్యంగా పడి పోవటంతో రియల్టర్లు లబోదిబోమంటున్నారు. రెండేళ్ల క్రితం ఓ ప్లాటుకు రూ.12 లక్షలు ధర పలుకగా ఇప్పుడు అదే ప్లాటుకు రూ.8లక్షలు కూడా ధర పలుకడం లేదని యాజమానులు వాపోతున్నారు. ఆసిఫాబాద్ సమీపంలో పంట పొలాలకు ఎకరానికి రూ.40లక్షలు ధరపలికిన ఇప్పుడు ఒక్కసారిగా పడి పోయింది. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఎకరాల కొద్ది 2023 వరకు భూముల అమ్మకాలు జోరుగా సాగాయి. 2024, 2025 సంవత్సరాల్లో ప్లాట్ల అమ్మకాలు జరుగటం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడి పోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటం జరిగింది. కొత్తగా ఏర్ప డిన ప్రభుత్వం హైడ్రా పేరుతో నాలాల చుట్టు ఉన్న అక్రమ కట్టడాల తొలగింపు గతేడాది నుంచి జరుగుతోంది. ఈ ప్రక్రియతో ఒక్కసారిగా రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం రంగంపై పెను ప్రభావం చూపించింది. హైదరాబాద్ మేజర్ మున్సిపాలిటీల్లో గతంలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇంటినిర్మాణాలకు అనుమతిలిచ్చినప్పటికీ కూడా నాలా సమీపంలో ఉన్నట్టు..? వీటిని ఎలాంటి నోటీసులు లేకుండానే హైడ్రా అధికారులు తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కూడా నాలాల సమీపంలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక వీఐపీ పాఠశాల భవనం నాళాలకు ఆనుకొని ఉండడంతో మున్సిపల్ పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగి తొలగించారు.

- ఎగబాకి.. అంతలోనే పడిపోయి..

గడిచిన పదేళ్లలో రియల్ ఎస్టేట్ రంగంలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. పదేళ్ల క్రితంతో పోల్చితే వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. 2014తర్వాత రియల్‌రంగం వేగంగా అభివృద్ధి చెందింది. కాగా ఏడాదిన్న కాలంగా నెమ్మదిగా కుదేలవడం ప్రారంభ మైంది. జిల్లాలో ఇప్పటి వరకు డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) 20 వెంచర్లకు రాష్ట్రప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇచ్చింది. ఒక ఎకరంలో 9 ప్లాట్లు, క్రీడాస్థలం, వాటర్ ట్యాంకు, డ్రైన్స్ నిర్మాణం ఉండేలా వెంచర్ ఏర్పాటు చేశారు. కూడా చేశారు. పక్కా నిబంధనల ప్రకారం చేసినప్పటికీ కూడా వీటి విషయంలో కూడా కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం వ్యాపారం లేక పోవడంతో కోట్లు పెట్టుబడి పెట్టిన వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వ్యాపారం అంతగా లేక పోవడంతో రిజిస్ట్రేషన్లశాఖ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. క్రయవిక్రయాలకు సంబంధించి డాక్యుమెంట్లు రోజురోజుకు పడిపోతున్నాయని చెబుతున్నారు. పెళ్లిళ్ల కోసమో, ఆసుపత్రి ఖర్చులకోసమో, ఇంటి నిర్మాణం కోసమో భూమి గానీ, ప్లాట్‌గానీ అమ్ముకుందామనుకున్న వారికి సైతం చుక్కెదురవుతోంది. కొనేవారులేక పోవడంతో అత్యవసరము ఉన్న వారు ఎంతో కొంతకు అమ్ముకోవల్సి వస్తోందని వాపోతున్నారు.

బొమ్మెన అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం



అధికారులు గుర్తించిన పాదముద్రలు

వేమనపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలం బొమ్మెన అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. చిరుతపులి బుధవారం లింగాల సమీపంలో సంచరించగా అడుగులను స్థానిక రైతులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు వెళ్లి చిరుతపులి పాదముద్రలను గుర్తించారు. చిరుతపులి లింగాల అటవీ ప్రాంతం నుంచి గురువారం ఉదయం బొమ్మెన అటవీ ప్రాంతం వైపు వెళ్లినట్లు గుర్తించామని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాపర్లు పశువులను, మేకలను, గొర్రెలను తీసుకుని అటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దని హెచ్చరించారు. మండలంలోని నాగారాం, సూరారం, లక్ష్మీపూర్, మామిడిపల్లె, బొమ్మెన, జక్కెపల్లి, లింగాల, చింతపూడి, మంగెనపల్లి, వేమనపల్లి గ్రామాల రైతులు పంట పొలాలు, చేన్లలోకి వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని సూచించారు. కాగా చిరుతపులి సంచారంతో ఈ గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కాగా గత సంవత్సరం ఈ ప్రాంతంలో పెద్దపులి సంచరించగా తాజాగా చిరుతపులి సంచరిస్తుండడంతో ప్రజలు భయందోళన చెందుతున్నారు.

చిరుతపులి దాడిలో మేక మృతి

కన్నెపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల గ్రామపంచాయతీ పరిధిలో చిరుతపులి దాడిలో ఓ మేక బుధవారం మృతిచెందింది. లింగాల గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి మేత కోసం మేకల మందను తీసుకుని వెళ్లగా ఒక్కసారిగా మేకల మందపై చిరుతపులి దాడి చేయడంతో ఎల్కారి మధునయ్యకు చెందిన మేక మృతి చెందింది. మేకల కాపరులు గట్టిగా కేకలు వేయడంతో చిరుతపులి అక్కడ నుంచి వెళ్లిపోయి కాపరులు తెలిపారు. ఈ విషయాన్ని అటవీ అధికారులకు తెలపడంతో గురువారం వారు వెళ్లి పరిశీలించగా లింగాల, నాగారం గ్రామాల వైపు నుంచి నీల్వాయి రేంజ్ అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు అటవీ అధికారులు తెలిపారు. చిరుతపులి సంచారంతో కుష్నపల్లి, నీల్వాయి రేంజ్‌లలోని గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

పరిశీలించి.. సూచనలు చేసి..



వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్టీఆర్‌కాలనీలో వరద ముంపు ప్రాంతాన్ని గురువారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం, అత్యవసర మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని చెప్పారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కాలంలో అధి కారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రేనేజీల్లో పూడిక లేకుండా ముందస్తుగా చర్య లు చేపట్టాలన్నారు. వరద వచ్చే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వట్టివాగు డి కాల్వ పూడిక పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. అవసరమైన మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వినాయక విగ్రహాల వద్ద పూజలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సూర్యప్రకాష్, సిబ్బంది ఉన్నారు.

రైతుల వివరాలు నమోదు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా జిల్లాలో పంటలు నష్ట పోయిన రైతుల వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వెంక టేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన కలెక్టర్ చాంబర్ నుంచి మండలాల వ్యవసాయాధికారులు, ఏఈవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు కోల్పోయారని అన్నారు. మండ లాల్లో ప్రతి భారీ వర్షాలు కురిశాయని తెలిపారు. ఏఓలు, ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలు నష్ట పోయిన రైతుల వివరాలు సేకరించాలన్నారు. అర్హులైన ప్రతి రైతు పేరు జాబితాలో ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అనర్హుల పేర్లు జాబితాలో ఉండకూడదని సూచిం చారు. నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏవోలు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

'రైతుల కంటే బిహార్ ఎన్నికలే ముఖ్యమా'

సిర్పూర్(టి)/ బెజ్జూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పండగ రోజు కూడా వర్షంలో యూరియా కోసం రైతులు లైన్లలో నిల్చుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిహార్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. సిర్పూర్(టి), బెజ్జూరు మండల కేంద్రాల్లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా ఇవ్వకుండా కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాజకీయాలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకుల కేంద్ర ప్రభుత్వం యూరియా ఇవ్వలేదంటుంటే, బీజేపీ ఇచ్చామంటుందని మధ్యలో రైతులే మోసపోతున్నారని చెప్పారు. వాస్తవానికి యూరియా కొరతకు కాంగ్రెస్, బీజేపీ పార్టీల బ్లాక్ దందానే కారణమని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ తమ అనుచరుల ద్వారా యూరియా తీసుకొని బ్లాక్‌లో అధిక ధరలకు అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. రైతుల నుంచి దోచుకున్న సొమ్మును రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పంపుతున్నారని తెలిపారు. మరో వైపు విద్యార్థులు ఫీజురీయింబర్స్‌మెంట్ రాక అవస్థలు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వేల కోట్లు బకాయిలు ఉండడంతో యజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని చెప్పారు. దీంతో బీటెక్, ఫార్మసీ విద్యార్థులు పై చదువులకు వెళ్లలేక ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక అవస్థలు పడుతున్నారని, విద్యాశాఖ మంత్రి ఏం చేస్తున్నారని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల టెండర్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మెగా కృష్ణారెడ్డి, సీఎం రమేష్ వంటి వారికి ఇస్తున్నారని కానీ విద్యార్థుల బకాయిలు మాత్రం చెల్లించడం లేదన్నారు. విద్యార్థులకు డబ్బులు లేవు కానీ కాంట్రాక్టర్లకు ఇవ్వడానికి మాత్రం ఉన్నాయా అని నిలదీశారు. ఆయన వెంట నాయకులు శ్యాంరావు, అస్లాం, చాంద్‌పాషా, సత్యనారాయణ, లలిత, హీరామన్, వర్మ, హర్షద్ హుస్సేన్, శ్యాంరావు, సారయ్య, శ్రీనివాస్, జాకీర్ హుస్సేన్, విశ్వనాథ్, మనోహర్, తిరుపి, బాపురావు తదితరులు ఉన్నారు.

జిల్లాలో 3,53,904 మంది ఓటర్లు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 మండలాల్లో 3,53,904 మంది ఓటర్లు ఉన్నారు. పంచాయతీ ఎన్నికలకు అడుగులు పడుతున్న వేళ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో గురువారం మండలాల వారీగా ఓటరు జాబితా విడుదల చేశారు. జిల్లాలోని 15 మండలాల్లో 3,53,904 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,76,610 మంది, మహిళలు 1,77,274 మంది మహిళలు ఉన్నారు. ఆసిఫాబాద్‌లో 30,324 మంది, బెజ్జూరులో 23,734 మంది, చింతలమానేపల్లిలో 23,955 మంది ఓటర్లు ఉన్నారు. దహెగాంలో 22,092 మంది, జైనూరులో 24,363 మంది, కాగజ్‌నగర్‌లో 45,242 మంది, కెరమెరిలో 24,026 మంది, కౌటాలలో 27,357 మంది ఉన్నారు. లింగాపూర్‌లో 10,583 మంది, పెంచికల్‌పేటలో 12,302 మంది, రెబ్బెనలో 28,724 మంది, సిర్పూర్(టి)లో 22,182 మంది, తిర్యాణిలో 18,148 మంది, వాంకిడిలో 28,595 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులు జాబితాలు వెల్లడించారు.

అతిగా మద్యం సేవించి ఒకరి మృతి

బెజ్జూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన నికాడి వసంత్(35) అనే వ్యక్తి అతిగా మద్యం తాగి మృతి చెందినట్లు ఎస్సై సర్తాజ్ పాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వసంత్ ఈ నెల 26న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. గురువారం గ్రామ సమీపంలోని పత్తి చేనులో శవమై కనపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతుడి భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..

కోటపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో మాను మాండ్ల నరేందర్ అనే రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. రోడ్డు పక్కన నివాస గృహాలకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలకు ఎర్త్ రావడం, ఎద్దు అటు వైపుగా వెళ్లి తాకడంతో విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందినట్లు బాధిత రైతు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ. 40 వేల వరకు ఉంటుందని, అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

కనీస వేతనాల అమలులో యాజమాన్యం విఫలం



కండువాలు వేస్తున్న ఏటీఐయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాల అమలులో సింగరేణి యాజమాన్యం విఫలమైందని ఏటీఐయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. నస్పూర్ కాలనీలోని సివిల్ విభాగం కాంట్రాక్ట్ కార్మికులు ఏఐటీయూసీలో చేరగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై వారికి కండువాలు కప్పారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణిలో దాదాపు 33 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి కనీస వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు ఉద్యోగాలు, ఉద్యోగ భద్రత, వైద్య సౌకర్యం, లాభాల్లో ఐదు వేల రూపాయల వాటా తమ యూనియన్ ఇప్పించామన్నారు. బ్యాంకులు, యాజమా న్యంతో మాట్లాడి కాంట్రాక్ట్ కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే 30 లక్షల రూపాయలు ఇప్పించేందుకు ఒప్పించామన్నారు. ఇంకా కనీస వేతనాలు అమలు చేయకుంటే తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, పిట్ కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు ప్రభాకర్, వీరేశం, సురేంద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

జైపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ విఫలమయ్యాయని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా సెక్రటరీ అన్వేష్‌రెడ్డి అన్నారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం 2024-25 సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాలు వెల్లడించడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఐకే1ఏ గని మేనేజర్ కోటయ్యకు వినతిపత్రం అందించారు. వాస్తవ లాభాలపై 35 శాతం లాభాల వాటా ప్రకటించాలని, డిమాండ్ చేశారు. కార్మికులకు ఆదాయ పన్ను రద్దు చేయాలని, అలవెన్స్‌లపై ఆదాయ పన్ను యాజమాన్యమే చెల్లించాల ని కోరారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 43 వేల కోట్ల బకాయిలను కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులు తక్షణమే ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోదార్ల సంతోష్, గడ్డం మల్లయ్య, రామారావు, గోపాల్, రాజశేఖర్, రవి పాల్గొన్నారు.

ఉత్పత్తిలో కార్మిక సంఘాలది కీలక పాత్ర

మందమర్రిటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంస్థ అభివృద్ధిలో, ఉత్పత్తి ఉత్పాదకతలో కార్మిక సంఘాలదే కీలక పాత్ర అని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. స్థానిక జీఎం కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం గుర్తింపు సంఘంతో నిర్వహించిన స్ట్రక్చరల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మందమర్రి ఏరియా అభివృద్ధికి సంబంధించికార్మికసంఘాలు చేయూతనివ్వాలని తెలిపారు. అంతేగాకుండా సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకొస్తే వెనువెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. గుర్తింపు సంఘం తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సింగరేణి ఉద్యోగ సంక్షేమానికిపెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రక్షణకు సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏరియాకు నిర్దేశంచిన లక్ష్యాలతో పాటు అదనపు ఉత్పత్తి సాధించేలా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ అక్బర్ అలీ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, కేకే1 గ్రూపు ఏజెంట్ రాందాసు, ఏరియా డీజీఎం ఈఅండ్ఎం సురేశ్ ఇన్‌చార్జి ఇంజనీర్ బాలాజీ భగవతి, ఐఈడీ ఇంజనీర్ కిరణ్‌కుమార్, సివిల్‌ఎస్ఈ రాము, డీవైపీఎం సందీప్, బెల్లంపల్లి బ్రాంచి సెక్రటరీ దాగాం మల్లేశ్, ఏఐటీయూసీ మందమర్రి వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్ పాల్గొన్నారు.

ఆందోళన విరమించిన లోడింగ్ కార్మికులు

కాసిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఓరియంట్(అదాని)సిమెంట్ కంపెనీలో మంగళవారం రెండో షిఫ్ట్‌లో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనకు దిగిన లోడింగ్ కార్మికులు బుధవారం అధికారుల హామీతో ఆందోళన విరమించారు. పాత పద్ధతినే జీతాలు చెల్లిస్తూ సమస్యలు పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది.

మాజీ జడ్పీటీసీకి సన్మానం

లక్సెట్టిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మాజీ జడ్పీటీసీ ముత్తె సత్తయ్య భారతీయ జనతాపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికల కాగా నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. జిల్లా కోశాధికారిగా పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు రమేష్ చంద్ జైన్‌కు అవకాశం దక్కింది. నాయకులు గడికొప్పుల సతీష్, కొండ నరేష్, దనిశెట్టి మల్లెష్, కానగంటి కార్తీక్, రాఖేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి

లక్సెట్టిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఎకనామిక్స్ అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం ప్రిన్సిపల్ సంతోష్ మహాత్మకు వినతిపత్రం అందించారు. సదరు అధ్యాపకుడు కళాశాలకు 42రోజుల పాటు రాకుండా విద్యార్థులకు బోధన చేయకుండా పరీక్షలు నిర్వహిస్తానని తెలుపుతుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభంజన్ ఉన్నారు.

'మందమర్రి ఏరియా భవిష్యత్ అంధకారం'

మందమర్రిటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా భవిష్యత్‌పై ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే కేకే 1, ఆర్కే 1ఏ, ఆర్కే ఓసీపీ మూతపడ్డాయని, కొత్త గనులు రాక ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయన్నారు. కేకే 5 గని త్వరలోనే మూత పడే అవకాశాలున్నందున కేకే 6 గనిని, శ్రావణపల్లి గనులను అందుబాటులోకి తేవాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం కృషిచేయాలన్నారు. మందమర్రి ఏరియా భవిష్యత్ కోసం ఆందోళనలు చేస్తామన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్, రాజేష్, గట్టయ్య పాల్గొన్నారు.

'ఓరియంట్' ఎన్నికల్లో హోరాహోరీ

- భారీగా ధన ప్రవాహం
- ఒక్కో ఓటుకు రూ. 70వేల వరకు పంపిణీ
- కార్మికుల మద్దతు కూడగట్టేందుకు అభ్యర్థుల యత్నం



మంచిర్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాసిపేట మండలం దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపెనీలో యూనియన్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఎన్నికలు నిర్వహిస్తుండగా, చివరి రెండు రోజులు ధన ప్రవాహం జోరుగా కొనసాగింది. ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతో అభ్యర్థులు భారీ మొత్తంలో ఖర్చు చేయడానికైనా వెనకాడటం లేదని తెలుస్తోంది. ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు పెద్దమొత్తంలో నగదు ముట్టజెప్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేగాకుండా ఇప్పటికే పలువురు ఓటర్లు, యూనియన్ లీడర్లను గోవా, హైదరాబాద్ లాంటి నగరాలకు క్యాంపులకు తరలించినట్లు సమాచారం. క్యాంపుల్లో నాయకులకు సకల సౌకర్యాలు కల్పించినట్లు తెలుస్తోంది.

● రంగంలోకి మంత్రి, ఎమ్మెల్యేలు....

ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఎన్నికల్లో పోటీ పడుతున్న కొక్కిరాల సత్యపాల్‌రావు, పుస్కూరి విక్రం రావులకు మద్దతుగా చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేకానంద (రాష్ట్ర కార్మికశాఖ మంత్రి), కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వినోద్ రంగంలోకి దిగారు. బరిలో నిలిచిన కొక్కిరాల సత్యపాల్‌రావు స్వయానా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సోదరుడు కాగా, మరో అభ్యర్థి విక్రంరావుకు మద్దతుగా గడ్డం సోదరులు రంగంలోకి దిగారు. దీంతో అభ్యర్థులకంటే ఎమ్మెల్యేల బలాబలాలపైనే ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఫైముగ్గురు ఎమ్మెల్యేలు ఇంత కష్టపడలేదని ప్రచారం జరుగుతోంది. ప్రేంసాగర్‌రావుకు కాసిపేట సొంత మండలం కావడంతో ఆయన తన సోదరుడి గెలుపే లక్ష్యంగా పట్టుదలతో ఉన్నారు. కొంతకాలంగా గడ్డం సోదరులకు, ప్రేం సాగర్‌రావు మధ్య దూరం పెరిగింది. తనను కాదని వివేకానందకు మంత్రి పదవి దక్కడంతో ప్రేంసాగర్‌రావు ఒకింత గుర్రుగా ఉన్నారు. దీంతో ఓరియంట్ సిమెంట్ ఎన్నికల్లో ఆదిపత్యం కొనసాగించాలనే పట్టుదలతో ప్రేంసాగర్‌రావు ఉన్నారు. తమ అభ్యర్థిని విజయం వరించేలా మంత్రితోపాటు ఎమ్మెల్యేలంతా ఎవరికి వారే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. గుర్తింపు సంఘం ఎన్నికలను ఎమ్మెల్యేలంతా ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం కొద్ది రోజులుగా జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే అంశంపై చర్చ సాగుతోంది. తామే స్వయంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు భావిస్తున్న ప్రజాప్రతినిధులు తమ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. విక్రంరావుకు మంత్రి వివేక్, బెల్లంపల్లి, ఖానాపూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వెడ్మ బొజ్జు మద్దతునిస్తుండగా, సత్యపాల్‌రావు తరుపున మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఒంటరి పోరాటం చేస్తున్నారు. అభ్యర్థులు ఇరువురికి మద్దతుగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల అనుచరులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా ఒకే పార్టీకి చెందిన ఎమ్మెల్యేలంతా స్వయంగా రంగంలోకి దిగడంతో ఓరియంట్ ఎన్నికల్లో చివరికి గెలుపు ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ కార్మికులతోపాటు అక్కడి ప్రజల్లోనూ నెలకొంది.

పెద్ద మొత్తంలో ఖర్చు...

ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో భారీగా ధనప్రవాహం కొనసాగినట్లు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. కంపెనీలో 266మంది కార్మికులు పనిచేస్తుండగా, వారంతా ఈ నెల 29న జరుగనున్న ఎన్నికల్లో తమఓటు హక్కును వినియోగిం చుకోనున్నారు. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు ఇరువురి తరుపున పెద్ద మొత్తంలో ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఓటర్లస్థాయిని బట్టి ఒక్కొక్కరికి రూ.30 వేలు మొదలుకొని రూ.80వేల వరకు ముట్ట జెప్పినట్లు సమాచారం. నగదు చెల్లింపులతోపాటు టూర్లు, విందుల పేరుతోనూ భారీగా ఖర్చు చేసినట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి.

నేడే దేవాపూర్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలు

కాసిపేట : దేవాపూర్ సిమెంట్ కంపెనీలో శుక్రవారం జరుగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకుంది. బుధవారంతో కార్మిక సంఘాల గేటు మీటింగ్ ముగియడంతో గురువారం నుంచి బహిరంగ ప్రచారానికి తెరపడింది. దీంతో ఎన్నికలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పోటాపోటీగా జరిగిన ఎన్నికల ప్రచారంతో గెలుపుపై ఎవరిదీమా వారే లెక్కలేసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయ్యే ఎన్నికల పోలింగ్ సాయంత్రం మూడుగంటల వరకు ముగుస్తుంది. అదేరోజు సాయంత్రానికి ఫలితాలు వెలువడనున్నాయి.


కొక్కిరాల సత్యపాల్‌రావు


పుస్కూరి విక్రమ్‌రావు

● డీసీఎల్ అధికారులు ఓరియంట్ ఎన్నికల్లో ఐదు యూనియన్లకు పోటీచేసే అవకాశాలు కల్పించారు. కానీ ఓరియంట్ సిమెంట్ కార్మిక సంఘం, లోకల్ ఓరియంట్‌సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ విక్రమ్‌రావుకు మద్దతు తెలుపుతోంది. తెలంగాణ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్అండ్‌వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్‌వర్కర్స్ ఫెడరేషన్ సత్యపాల్‌రావుకు మద్ద తు తెలుపుతోంది. ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ లోకల్‌యూనియన్ తటస్థంగా ఉండి పోయింది. ఇరువర్గాల అభ్యర్థులు హోరా హోరీగా ప్రచారం నిర్వహించారు.

అప్పు ఇచ్చిన డబ్బులు అడిగినందుకు హత్యాయత్నం

మందమర్రిటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఎన్నం మొండిపై అదే ప్రాంతానికి చెందిన దేవసాని నరేందర్ హత్యయత్నానికి పాల్పడినట్లు మందమర్రి ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. ఎన్నం మొండి భార్య రెండు సంవత్సరాల క్రితం నరేందర్‌కు కొంత డబ్బు ఇచ్చింది. ఆమె మృతిచెందగా అప్పు ఇచ్చిన డబ్బులను తిరిగి మొండి నరేందర్‌ను అడిగాడు. నరేందర్ ఈనెల 25న రాత్రి మొండి ఇంట్లోకి చొరబడి మారణాయుధాలతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. బాధితుడి కుమార్తె రజిత ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి నరేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

మందమర్రిటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మహిళతో ఆమె ఇంటి ఎదురుగా ఉండే గంధం శ్రీకాంత్ అనే వ్యక్తి మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. మహిళ ఇంట్లోకి చొరబడి దాడి చేశాడని తెలిపారు. ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి రక్షించినట్లు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యూరియా కోసం క్యూలో ఉన్న రైతుకు ఫిట్స్

చెన్నూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మండలంలోని దుగ్నేపల్లి గ్రామంలో బొంబురవు రాజిరెడ్డి అనే రైతు యూరియా కోసం గురువారం క్యూలైన్‌లో ఉండగా ఫిట్స్ రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే గమనించిన తోటి రైతులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుగ్నేపల్లిలో ఉన్న సెంటర్‌కు యూరియా బస్తాలు వచ్చాయి. దీంతో రైతులు ఉదయం నుంచే సెంటర్ వద్దకు చేరుకుని క్యూలో ఉన్నారు. రాజిరెడ్డి క్యూలైన్‌లో సుమారు మూడుగంటలలు ఉండడంతో ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి స్పృహ కోల్పోయాడు. అక్కడున్న రైతులు నీరు తాగించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉంది.

గణేష్ మండపాల తనిఖీ

తాండూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను గురువారం తాండూర్ సీఐ దేవయ్య ఆధ్వర్యంలో ఎస్‌ఐ కిరణ్‌కుమార్‌లు తనిఖీ చేశారు. గణపతి నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలుంటాయని హెచ్చరించారు.

అదుపు తప్పిన కారు... తప్పిన ప్రమాదం

జైపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం గోదావరి వంతెన మీద గురువారం ప్రమాదవశాత్తూ కారు అదుపుతప్పి బ్రిడ్జి ప్రహరీని ఢీకొట్టి సగంలో ఆగిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు గోదావరిఖనికి వెళ్లి మంచిర్యాలకు తిరిగి వస్తుండగా కారు ముందు టైరు పగిలిపోవడంతో వెనక వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. దీంతో కారు బ్రిడ్జి ప్రహరీ ఢీకొట్టి మధ్యలో ఆగింది. ఇందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. గోదావరి నిండుకుండలా ప్రవహిస్తుండడంతో కొంచెం అటు ఇటు అయినా పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు. వెంటనే స్పందించిన పోలీసులు కారును బయటకు తీసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ఐకే 1ఏ గనిలో లే ఆఫ్ ప్రకటించిన యాజమాన్యం

జైపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ గనిలో రెండో షిఫ్టు నుంచి సింగరేణి యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించినట్లు గని మేనేజర్ కోటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం గోదావరి మట్టం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో లేఆఫ్ ప్రకటించినట్లు పేర్కొన్నారు.

భారీ వర్షం.. అతలాకుతలం

(5వ పేజీ తరువాయి..)

లోలెవల్ వంతెనపై వరద నీరు పొంగిపోర్లడంతో కోర్విచెల్మ ముత్యంపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చింతపల్లి నుంచి కుందేళ్లపహ్లాడ్ వెళ్లే రోడ్డు వరద నీరు ప్రవాహంతో రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మదాపూర్, నర్సాపూర్ గ్రామాలకు వెళ్లే రహదారిలో లోలెవల్ వంతెనపై వరదనీరు పొంగి పొర్లుడంతో గ్రామాల మధ్య ప్రజలు, వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షల కారణంగా దండేపల్లి తహసిల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, ఎస్సై తాహసినోద్దీన్, ఆర్ఐ భూమన్న, మండలస్థాయి అధికారులు, సిబ్బంది వరదల ప్రభా వంపై ప్రజలను అప్రమత్తం చేశారు. దండేపల్లిలో మాడేలయ్య స్వామి ఆలయాన్ని వరద నీరు చుట్టు ముట్టింది.

జన్నారం: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలం అతలాకుతలం అయింది. మండలంలోని రోటిగూడకు వెళ్లే ప్రధాన రహదారికిగల ప్రధాన వంతెనపై వాగు ఉప్పొంగి ప్రవహించింది. జన్నారం వాగు ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు లోతట్టు ప్రాంత వాసులందరినీ స్థానిక ఆశ్రమ పాఠశాల, పీఆర్‌టీయూ భవన్‌లోకి పంపించారు. మండలంలోని 12 డిస్ట్రిబ్యూటర్ కడెం కెనాల్ కాల్వలోకి నీరు అధికంగా చేరడంతో మొర్రిగూడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల ఇళ్లలోకి నీరు చేరింది. పాతపొన్కల్ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తాటిచెట్టుపై పిడుగు పడడంతో సమీపంలో ఉన్న పి లచ్చన్న ఇంటి స్లాబ్‌పై పెచ్చులు ఊడి విద్యుత్ తీగలు కాలిపోయాయి. శ్రీలంకకాలనీలోకి నీరు చేరడంతో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్ వెళ్లి దగ్గర ఉండి చర్యలు చేపట్టారు. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. తిమ్మాపూర్ గ్రామంలో పాఠశాలలోకి భారీగా నీరు చేరింది. మరికొన్ని ప్రాంతాల్లో పంటపొలాల్లోకి నీరుచేరడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేరుకొని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం తిమ్మాపూర్, రోటిగూడ, పలు ప్రాంతాల్లో సందర్శించారు.


జిల్లా కేంద్రంలో రాళ్లవాగు నీటిలో మునిగిన ఆదిత్య ఎన్‌క్లేవ్ సమీపంలోని ఇళ్లు

కడెం కెనాల్‌లో పడి యువకుడి మృతి..



మండలంలోని మొర్రిగూడె గ్రామానికి చెందిన బాదావత్ గంగాధర్(25) అనే యువకుడు బుధవారం కడెం కాలువలో పడి మృతి చెందాడు. రోజువారీ లాగే బుధవారం కూలీపనికి వెళ్లి సాయంత్రమైనా గంగాధర్ తిరిగి రాకపోవడంతో మృతుడి భార్య మంజులతో పాటు బంధువులు స్థానికంగా వెతకారు. ఈ క్రమంలో వెతకగా స్థానిక కడెం కెనాల్ 12వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో మృతి చెంది కనిపించాడు. బుధవారం రాత్రి కాలువలో ప్రమాదవశాత్తు కాలు జారిపడి ఉంటాడని కేసు నమోదు చేస్తున్నామని ఎస్‌ఐ అనూష తెలిపారు.


అంబులెన్స్ ద్వారా గర్భిణులు, బాలింతలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న అధికారులు

జైపూర్: మండలంలోని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీధర్‌లతో కలిసి ఇందారం, కిష్టాపూర్, వేలాల, పొనూరు, శివ్వారం గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శించారు.

● గోదావరికి వరద ఉధృతి..

దండేపల్లి: రెండు రోజుల నుంచి ఏకదాటిగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గూడెం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి పెరిగింది. మండలంలోని గోదావరి నది అనుకొని ఉన్న గుడిరేవు, లక్ష్మీకాంతపూర్, ద్వారక, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్, నంబాల, గూడెం గ్రామాలోని వరద నీరు పంటపోలాలకు రావడంతో వందలాది ఎకరాల పత్తి, వరి పంటలు నీటమునిగాయి.

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

కాసిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామపంచాయతీల డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాను ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీవో షేక్ సప్తర్‌అలీ, సహాయకులు లక్ష్మీనారాయణ, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: ఓటర్ల తుది జాబితాను అధికారులు గ్రామ పంచాయతీల్లో గురువారం ప్రదర్శనకు ఉంచారు.

తాండూర్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శించారు. ఓటర్లు, ప్రజాప్రతినిధులు పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలుంటే 30వతేదీ లోగా లిఖిత పూర్వకంగా తెలిపాలని సూచించారు.

ఓటర్ల జాబితాపై రేపు సమావేశం

కోటపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 30న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

శ్రీరాంపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్, వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పెద్దపల్లి సత్యనారాయణ అన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 6వ తేదీన మందకృష్ణ మాదిగ మంచిర్యాల జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ


లక్సెట్టిపేటలో రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

లక్సెట్టిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా దుకాణాల్లో సోదాలు చేశామన్నారు. అనంతరం జెండ వెంకటాపూర్, వెంకట్రావు పేట సహకార సంఘాల్లో నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ ప్రశాంత్, ఏఈ సురేష్, హెచ్‌సీ శ్రీనివాస్, ఏవో శ్రీకాంత్, పీసీ అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యురియా నిల్వలను విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి ఎరువులు, మందుల నిల్వలను పరిశీలించారు. విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి గోర్ల అంజిత్‌కుమార్, విజిలెన్స్ సీఐ ప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె, లేగదూడ మృతి

భీమారం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రానికి చెందిన తమ్మినవేని సతీష్‌కు చెందిన గేదె, లేగదూడ గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఇంటి సమీపంలో మేత మేస్తుండగా పక్కన పొలం చుట్టూ కంచెకు వేసిన ఫెన్సింగ్ వైరు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ రూ.90వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు సతీష్ కోరుతున్నాడు.

పేకాట రాయుళ్ల పట్టివేత

నస్పూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): న్యూ నాగార్జున కాలనీ ఆటో స్టాండ్ సమీపంలో గల ఓ క్వార్టర్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో గురువారం రాత్రి పోలీసులు తనిఖీ చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురని పట్టుకున్నట్లు ఎస్సై ఉపేందర్ రావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 25,730 నగదు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

తాండూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడేది ఐఎన్‌టీయూసియేనని బెల్లంపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సెంట్రల్ డిప్యూటీ సెక్రటరీ ప్రకాష్‌రావు పేర్కొన్నారు. గురువారం తాండూర్‌లో వారు మాట్లాడారు. ప్రస్తుత గుర్తింపు సంఘం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, చంద్రకుమార్, శ్రీనివాస్, రాజేశం, కుమారస్వామి, చారి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నెలకొన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. కేంద్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి, శ్రీరాంపూర్‌లోని అన్ని గనులు, విభాగాలపై అధిపతులకు వినతిపత్రాల అందించారు. ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, నాయకులు పొగాకు రమేష్, పానుగంటి సత్తయ్య, పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమార స్వామి, గోనె స్వామి, అన్వేష్ రెడ్డి, పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్పులు కడతాం.. మా బంగారం మాకు ఇవ్వండి

- ఎస్‌బీఐ బాధితుల ఆందోళన

చెన్నూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అప్పులు కడతాం మా బంగారం మాకు ఇవ్వాలంటూ చెన్నూరు ఎస్‌బీఐ బ్యాంక్-2 బాధితులు గురువారం ఆందోళన చేపట్టారు. గోల్డ్ లోన్ బాధితులు బ్యాంకులోకి చొరబడి బైఠాయించారు. బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి రుణం తీర్చుకున్నామని, ఇప్పుడు వడ్డీతో సహా అప్పు చెల్లిస్తామని తమ బంగారం కావాలంటూ పట్టుబట్టారు. సుమారు నాలుగు గంటల పాటు బ్యాంకులోనే బైఠాయించిన బాధితులు లోపల విచారణ జరుగుతున్న అధికారుల విధులకు అడ్డుతగిలారు. ఓ వైపు బ్యాంకు అధికారులకు, మరోవైపు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా బ్యాంకుకు సంబంధించిన లీగల్ అడ్వైజర్ ఆందోళన కారులను ఉద్దేశించి బంగారం ఎటుపోదని, కొంత సమయం కావాలని సంయమనం పాటించాలని చెప్పేందుకు ప్రయత్నించారు. సాయంత్రం వరకు ఆందోళన చేసిన బాధితులు తిరిగి వెళ్లిపోయారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకులు రాజారమేష్ వారికి సంఘీభావం తెలిపారు.

- పోయింది ఎంత?

బ్యాంకు స్కామ్‌లో బంగారం, నగదు స్వాహా కాగా పోయిన బంగారం ఎంత, నగదు ఎంత అనే విషయంలో ఇంత వరకు స్పష్టత రాలేదు. 20 కిలోల 496 గ్రాముల బంగారంతో పాటు రూ. 1.10 కోట్లు నగదు స్వాహా అయినట్టు నాలుగు రోజుల క్రితం విచారణ అధికారులు స్పష్టం చేయగా అది ఇంకా ఎక్కువనే ఉంటుందనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. సుమారు 30 కిలోల బంగారంతోపాటు నగదు సైతం రెట్టింపు ఉంటుందని తెలుస్తోంది. 402 మంది గోల్డ్‌లోన్ తీసుకున్న బాధితుల సంఖ్య తెలుపగా ప్రస్తుతం బాధితుల సంఖ్య 449 మందికి చేరింది.


బ్యాంకులో బైఠాయించిన బాధితులు

- పథకం ప్రకారమే....

బ్యాంకు క్యాషియర్ రవీందర్ పూర్తిస్థాయిలో పథకం ప్రకారమే స్వాహా చేసినట్లు మూడురోజుల విచారణలో కొత్త కోణం బయట పడింది. లాకర్ల నుంచి బంగారం తీసినప్పుడు సైరన్ మోగుతుంది. అయితే మధ్యాహ్నం సమయంలో బంగారం చోరీ చేసినప్పుడు సైరన్‌ను నైట్ మోడ్‌లో పెట్టడం, రాత్రి సమయంలో తీసినప్పుడు సైరన్‌ను మధ్యాహ్నం మోడ్‌లో పెట్టినట్లు అధికారులు గుర్తించారు.

- పోలీసుల అదుపులో నిందితుడు

బ్యాంకు స్కామ్ ప్రధాన సూత్రధారి రవీందర్ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో పోలీసులకు చిక్కినట్లు సమాచారం. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. పది కిలోల బంగారం తన వద్దనే ఉన్నట్లు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. మిగితా బంగారం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చేతుల్లో, ప్రైవేటు బ్యాంకుల్లో తనాఖా పెట్టాడనే అభిప్రాయాలు సైతం వెలువడుతున్నాయి. నగదును ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మార్చాడనే మాటలు సైతం వినబడుతున్నాయి. పూర్తిస్థాయిలో విచారణ జరిగితే కానీ స్వాహా అయిన బంగారం ఎంత, ఎక్కడ ఉంది, ఎవరి చేతుల్లో ఉందనే సమాచారం తెలిసే అవకాశం ఉంది.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘంలో చేరికలు

హాజీపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీన గ్రామాల పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరిక్రిష్ణ ఆధ్వర్యంలో ఆసంఘంలో చేరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా చిప్పకుర్తి అశోక్, ఉపాధ్యక్షులుగా మిట్ట సంపత్, ఆత్మకూరి మల్లేశ్ ఎన్నికయ్యారు. మంచిర్యాల వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శ్యాంకుమార్, క్యాషియర్ ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

భీమారం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు భీమారంలోని జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పీడీ మారయ్యలు తెలిపారు. ఈనెల 22న జరిగిన స్థాయి పోటీల్లో విద్యార్థులు సాహిత్, శ్రీకాంత్ హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లలో ప్రతిభ కనబర్చిన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 30,31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు. గురువారం విద్యార్థులను వారు అభినందించారు.

జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

మంచిర్యాలక్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యోగా పోటీల్లో పాత మంచిర్యాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారు. ఈ సందర్భంగా మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ వారిని సన్మానించారు. అండర్-14 బాలుర విభాగంలో నాగుల శశివర్ధన్ బంగారు పతకం సాధించగా బాలికల విభాగంలో కొల్లూరి స్వర్ణమయి, శెట్టి శివలాస్య బంగారు పతకాలు సాధించారు. వచ్చేనెలలో నిర్మల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని మాస్టర్ గోవిందుల అరుణ్‌కుమార్ అన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ

మంచిర్యాలక్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, నాయకులు భానేష్, నల్ల శంకర్ పాల్గొన్నారు.

తాండూర్: తాండూర్‌లోని ఐబీ చౌరస్తాలో బుధవారం తాండూర్ వాసవీ క్లబ్, వాసవి వనిత సింధూర క్లబ్ సభ్యులు 851 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. సంతోష్‌కుమార్, మధుసూదన్, మణికృష్ణ, మహేష్, అక్షయ, కవిత, స్పంద, కృప జ్యోతి, స్వప్న, సంజన, శ్రీదేవి పాల్గొన్నారు.


దండేపల్లిలో ఇంట్లోకి చేరిన వరద నీరు

భారీ వర్షం.. అతలాకుతలం

- ఉప్పొంగిన వాగులు, వంకలు
- ఎల్లంపల్లి వరదతో ఉగ్రరూపం దాల్చిన గోదావరి
- జిల్లా కేంద్రంలో ఉప్పొంగి ప్రవహించిన రాళ్లవాగు
- పలు కాలనీల్లో ఇళ్లలోకి చేరిన వరద
- సహాయక చర్యలు చేపట్టిన జిల్లా యంత్రాంగం

మంచిర్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలమైంది. భారీ వర్షానికి తోడు ఎగువన కురుస్తున్న వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు గరిష్ఠ మట్టం 148మీటర్లకుగాను 146.58 మీటర్లకు నీరు చేరింది. ప్రాజెక్టుసామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను 16.336 టీఎంసీలకు నీరు చేరింది. నిర్మల్ జిల్లాలోని కడెం రిజర్వాయర్ ఆరుగేట్లు ఎత్తినీటిని విడుదల చేస్తుండటంతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరుచేరడంతో మధ్యాహ్నం 12గంటల సమయంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు 40గేట్లు ఎత్తి 8,28,520 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. జిల్లా కేంద్రంలోని పుష్కరఘాట్ మునిగి వరద సమీపంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్దకు చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా అందులో చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణులను ఆర్టీసీ బస్సులు, అంబులెన్స్‌ల్లో స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. గోదావరి నిండుగా ఉధృతంగా ప్రవహించడంతో జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు ఉప్పొంగి, సమీపంలోని ఎన్టీఆర్ కాలనీ, రాంనగర్, ఎల్ఐసీ కాలనీ, ఆదిత్య ఎన్‌క్లేవ్ సమీపంలోని ఇళ్లలోకి చేరింది. దీంతో ముందస్తు చర్యలు చేపట్టిన కలెక్టర్ కుమార్ దీపక్ నేతృత్వంలో తహసీల్దార్ రఫతుల్లాఖాన్, ఇతర అధికారులు ప్రజలను స్థానికంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. కలెక్టర్ జిల్లా కేంద్రంలోని గోదావరి నది తీరం, మాతా శిశు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు.



మంచిర్యాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, జన్నారం మండలం తిమ్మాపూర్‌లో పాఠశాలలోకి చేరిన నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

● ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం...

బుధవారం కురిసిన భారీ వర్షం కారణంగా జిల్లాలో ని సింగరేణి ఏరియాలైన శ్రీరాంపూర్, మందమర్రి, గోలేటిలలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఓసీపీల్లో నీరు చేరడంతో భారీ వాహనాలు ఉపరితలానికే పరిమితం అయ్యాయి. వర్షాల కారణంగా ఓవర్ బర్డెన్ పనులు కూడా నిలిచిపోయాయి.

దండేపల్లి: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు దండేపల్లి మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగాయి. గ్రామాల్లో లోతట్టు ప్రాంతంలోని ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో నాన ఇబ్బంది పడ్డారు. వాగులు వంకలు పొంగి పొర్లి చెరువులు, కుంటలు నిండుపోయాయి. మండలంలోని కొర్విచెల్మ సమీపంలో ఉన్న..

(మిగతా 7లో..)


జిల్లా కేంద్రంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న రాళ్లవాగు

సీఎం ఏరియల్ సర్వే

హాజీపూర్ : రెండు రోజులుగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తంచేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి గురువారం హెలీకాప్టర్‌లో ఎల్లంపల్లి ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు అవతలివైపు ఉన్న గోలివాడ వద్ద హెలీక్యాప్టర్‌దిగి కాన్వాయితో ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్దకు వచ్చి పరిశీలించిన అనంతరం అధికారులతో ప్రాజెక్టు వివరాలను తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆయనవెంట మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్వర్‌కుమార్‌గౌడ్ ఉన్నారు. వరద పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వ యంత్రాంగం 24/7 అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డీవో శ్రీనివాస్‌లు, మంచిర్యాల ఏసీపీప్రకాశ్, రూరల్‌సీఐ ఆకులఅశోక్‌లు అప్రమత్తమయ్యారు. ఇరిగేషన్ సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈ వెంకటయ్య, డీఈ బుచ్చిబాబు, శరత్‌బాబు పాల్గొన్నారు.

నీల్వాయి ఎస్ఐగా కోటేశ్వర్



వేమనపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా కోటేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సురేష్ సస్పెండ్ కావడంతో పెద్దపల్లిటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై కోటేశ్వర్ నీల్వాయి ఎస్ఐగా వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరు సహకరించాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ

మంచిర్యాలక్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమగ్ర శిక్షణ భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరాలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మంచిర్యాల జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో జన్నారం దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన సీడబ్ల్యుఎస్ఎన్ విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. మందమర్రి, కాసిపేట, తాండూర్, భీమిని, కన్నెపల్లి, నెన్నెల, బెల్లంపల్లి, విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల బెల్లంపల్లిలో సోమవారం హాజరు కావాలని తెలిపారు. 18లోపు దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన వినికిడి యంత్రం వీల్‌చైర్, మూడు చక్రాల సైకిల్, స్కూటర్, కృత్రిమ అవయవాలు, స్మార్ట్ ఫోన్‌లు పొందడానికి శిబిరంలో నిర్ధారణ చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకోసం 8328363596 నంబర్‌కు ఫోన్‌చేయాలని కోరారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు


బెల్లంపల్లిలో గణనాథునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



మందమర్రిలో మట్టి వినాయకులు పంపిణీ చేస్తున్న సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, మల్కాపల్లిలో పూజలు నిర్వహిస్తున్న యువకులు


ఎల్ఐసీ కాలనీలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయంపూట వినాయకప్రతిమలను భాజభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి మండపాల్లో, ఆలయాలు, ప్రధాన కూడళ్లలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో వినాయక చవితిని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరహరి శర్మ అష్టసిద్ది వినాయకులకు ప్రత్యేక పూజలు చేశారు. పాత మంచిర్యాల, ఎల్ఐసీ కాలనీల్లో వినాయకుడికి మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ జాగృతి యూత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణంలో దాదాపు 140 గణపతి మండపాలను ఏర్పాటుచేసి పూజలు నిర్వహిస్తున్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గణపతి ఆలయ కమిటీ ఛైర్మన్ రఘుపతి రావు తెలిపారు. టీఎన్‌జీవోస్ కాలనీలో పర్యావరణ మిత్ర వినాయక మండలి వద్ద నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో ప్లాస్టిక్ బదులు స్టీల్ ప్లేట్స్‌ను, మంచినీటి కొరకు స్టీల్ గ్లాసులను వినియోగించారు. మండలి ప్రాంతంలో సింగిల్ య్యూజ్ ప్లాస్టిక్ కనపడకుం డా చర్యలు చేపట్టామని పర్యావరణవేత్త, కార్యనిర్వాహక అధ్యక్షుడు యోగేశ్వర్ తెలిపారు.

మందమర్రిటౌన్: గణనాథులవిగ్రహాల విక్రయదుకాణాల వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరారు. 15 నుంచి 20అడుగుల వరకు ఉన్న విగ్రహాలను క్రేన్‌ల సాయంతో తీసుకెళ్లారు. దాదాపు పట్టణంలోనే 300పైగా మండపాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. మందమర్రి మున్సిపాలిటిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహంవద్ద మున్సిపల్‌కమిషనర్ కుటుంబసభ్యులతో పూజలు నిర్వహించారు. హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు సూరిబాబు మండప నిర్వాహకులతో ర్యాలీలు చేపట్టారు.

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రజలు మట్టి వినాయకులనే పూజించలని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజలింగు తెలిపారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా పట్టణంలో వేర్వేరుగా మట్టి వినాయకుల పంపిణీ చేపట్టారు. ఎస్ఐ రాజశేఖర్‌తోపాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం సంఘం పట్టణ అధ్యక్షులు రావి వెంకటేశ్వర్లు, ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అజ్మోద్దీన్ పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. వినాయకచవితి సందర్భంగా పాత మంచిర్యాల రామాలయం శివాలయంలోని గణపతి పూజలో పాల్గొన్నారు.

● మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం దేవేందర్ అధికారులతో కలిసి గణపతికి పూజలు చేశారు. ఏరియాలోని కేకే5 గని వద్ద గణనాథునికి పూజలు చేశారు.

దండేపల్లి: మండలం కేంద్రంతోపాటు గ్రామాల్లో వాడవాడల ఏర్పాటు చేసిన మండపలలో వినాయకులను భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. గురువారం గణేష్ మండపాల్లో భక్తులు కుటుంబసమేతంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు.

బెల్లంపల్లి: పట్టణంలో వినాయక నవరాత్రోత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాసిపేట: మండలంలోని మల్కాపల్లిలో మైనార్టీ యువకులు గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి హిందు సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. పోచమ్మవాడకు చెందిన ఎస్‌కేరఫీక్ హిందువులతోపాటు మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లుచేసి పూజలు నిర్వహించడం మూడేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. రఫీక్‌కు అమ్మనాన్నలతోపాటు కుటుంబ సభ్యులు ఎండీ జావీద్, ఎండీ ఇమ్రాన్ సహకరిస్తున్నారు.

జన్నారం/భీమారం/మందమర్రిరూరల్/కన్నెపల్లి/చెన్నూర్: జన్నారం, భీమారం, మంద్రమర్రి, కన్నెపల్లి, చెన్నూర్ మండలంలోని పలు గ్రామాల ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద వినాయక విగ్రహా లను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఇళ్లలో వినాయక విగ్రహాల ను ప్రతిష్ఠించి పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. చెన్నూర్‌లోని ఉత్తర వాహిని గోదావరి తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలక్రైం/మంచిర్యాల కలెక్టరేట్: వరద పరిస్థితుల దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని గోదావరినదితీరం, మాతా శిశు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. గోదావరిలో నీటిప్రవాహం పెరుగుతున్నందున ప్రజలు ఎవరు అటువైపు వెళ్లకుండా బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు.


మంచిర్యాల గోదావరి నది తీరం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

రెవెన్యూ, పోలీసు, మున్సిపల్‌శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్షణ సహాయంకోసం సమీకృతజిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్‌రూమ్ నంబర్ 08736-250501 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రికివచ్చే ప్రజలకు మెరుగైనవైద్య సేవలందించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్ఐ శిరీష, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మాజీ చైర్మన్ భానేష్, పెంట రజిత ఉన్నారు.

యూఎస్‌ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయాలి

బెల్లంపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : యూఎస్ఎఫ్ఐ(భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్) జిల్లా మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి కోరారు. గురువారం పట్టణంలో మహాసభల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. విద్యారంగానికి సరైన నిధులు కేటాయించక విద్యార్థులకు అన్యాయం చేస్తోందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం లక్సెట్టిపేట పట్టణంలో సెప్టెంబరు 3న మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మూడో రైల్వేలైన్ ట్రాక్ ప్రారంభం


రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఆర్ఎస్‌బి చైర్మన్

బెల్లంపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి నుంచి బల్లార్షా రైల్వేస్టేషన్‌వరకు నూతనంగా చేపట్టిన మూడో రైల్వేట్రాక్‌ను గురువారం సెంట్రల్ రైల్వే సేఫ్టీ బోర్డు చైర్మన్ మాధవీలత ప్రారంభించారు. రైల్వేస్టేషన్ ఆవరణలో రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన మూడో లైన్ ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. రైల్వేశాఖ అధికారులతో కలిసి బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నుంచి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన వరకు మూడో రైల్వేలైన్ ట్రాక్ పనులను పరిశీలించారు. రైల్వే బ్రిడ్జీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మించిన మూడో లైన్‌కు సంబంధించిన నూతన కార్యాలయాన్ని పరిశీలించారు.

'ఓరియంట్' ఎన్నికలో హోరాహోరీ
● ఒక్కో ఓటుకు రూ. 70వేల వరకు పంపిణీ 7